# వెండితెర వెనుక

## సత్తిబాబు



గత ౩౫ సంవత్సరాలుగా తెలుగు సినీరంగంలో దర్శకత్వశాఖలో విశేషమైన అనుభవం ఉన్న రచయిత కలం నుంచీ ౧౯౭౮ ప్రాంతాల్లో మద్రాసులోని తెలుగు చలనచిత్ర రంగానికి అద్దం పట్టే ధారావాహిక నవల.

**రంగా!**

మై డార్లింగ్.....

నీకోసం మధ్యాహ్నం కాలేజీ ఎగ్గొట్టి వచ్చాను. ఫస్ట్‌షో టై!ం వరకూ, నీ రూం దగ్గరే కూర్చున్నాను తెలుసా! మీ ఇల్లు గల వాళ్ళమ్మాయి - రెండు, మూడు సార్లు బయటకొచ్చి - పర్టిక్యులర్‌గా నన్ను చూసి వెళ్ళింది! చూస్తే నాకు భయమేంటిగాని, ఐయామ్ టూ మచ్ డిసప్పాయింటెడ్! ఏడుకొండలెక్కితే ఆ దేవుడైనా కనిపిస్తాడంట! కానీ - ఇరవై ఆరు మెట్లు ఎక్కొచ్చి, రెండు వందల నలభై నిమిషాలు ఎదురు చూసినా...........

నీ -

జయ...

✷✷✷

స్టెల్లా మేరీస్ ముందున్న పేవ్‌మెంట్ రెయిలింగ్స్‌ని ఆనుకుని నిలబడాను. విసుగు పుడుతోంది. పొద్దున చాలా ఆలస్యంగా లేవడం వల్ల, హడావిడిగా తయారయ్యి, టిఫిన్ కూడా తినకుండా వచ్చి, ఇలా కాలేజీ ముందు పడిగాపులు కాస్తున్నాను. జట్లు జట్లుగా ఎంతో మంది అమ్మాయిలు వస్తున్నారు కాని, జయ అంతు లేదు.

నూటొకటోసారి వాచీ చూసుకుని, విసుగ్గా తలెత్తి దూరంగా - గుంపువైపు చూసాను. ఒక గ్రూపు అమ్మాయిలు వస్తున్నారు, అడుగులో అడుగువేసుకుంటూ! హంసగమనలు...! ఆ గ్రూప్‌నే తదేకంగా చూస్తున్నాను. వాళ్ళ మధ్యలోనే జయుంది. గంటనుండీ పడిన శ్రమంతా పోయి, జయని చూడగానే ఒంట్లో షేకింగ్ వచ్చింది. రెయిలింగ్స్ మీదనుండీ చేతులు తీసి నవ్వాను!

సమాధానంగా పదిమంది అమ్మాయిలూ నవ్వి సైగలు చేసారు, ఒక్క జయ తప్ప! నోరు వెళ్ళబెట్టి చూస్తుండగానే అంతా కిలకిలా నవ్వుతూ లోపలికి వెళ్ళిపోయారు! జయ కనీసం వెనక్కి తిరిగి కూడా చూడలేదు.... టట్!... ఇంకా ఇక్కడిలాగే నిలబడుంటే, రోమియోగాడనుకుని, మక్కెలిరగ్గొట్టి, వాన్ ఎక్కిస్తారు, పోలీసులు... ..ఛ. అనవసరంగా ఆఫీసు మాని రావడం నాదే బుద్ధి తక్కువ!

చాలా అసహనంగా రోడ్ క్రాస్ చేసి, ఫుట్‌పాత్ మీద నడవడం మొదలుపెట్టాను. ఫర్లాంగు నడవగానే ప్రక్కన ఆటో వచ్చి ఆగింది. లోపల్నుండీ తొంగి చూసి నవ్వుతుంది. ఒంట్లోని విసుగంతా కళ్ళతో చూపించాను.

"రా... రంగా" అని చెయ్యి పట్టుకుని ఆటోలోకి లాగింది. గంటసేపు నాక్కలిగిన శ్రమ... జయ నిర్లక్ష్యం జ్ఞాపకానికి వచ్చి, ఒళ్ళంతా ఉడికి పోయింది. "కోపం వచ్చిందా?" అంది.

"ఊఁ.... ఆఁ... అహ!..."

"అబ్బాయిగారికి నిజంగానే కోపం వచ్చిందే!" అని నా భుజం మీద నుండీ తన చేయిజాపి, నా ముఖాన్ని తనవైపుకు తిప్పుకుంది.

"ఉహూ.." ... అని తల విదిలించాను.

రెండు చేతులతో నా ముఖాన్ని పట్టుకుని" నావైపు చూడ్డం కూడా ఇష్టం లేదా!" అని తనవైపు తిప్పుకుంది.

జయ కళ్ళలోకి చూసాను. విశాలమైన కళ్ళు... నిర్మలంగా... వింత కాంతితో మెరుస్తున్నాయి. ఆ కళ్ళల్లోకి చూడగానే నా ఒంట్లో మరలా షేకింగ్!... జయ నడుం చుట్టూ చేయి వేసి దగ్గరకి...

"ఎంగె పోణం"... అన్నాడు ఆటోడ్రైవర్!

"ఎక్కడికెడదాం" అంది జయ!

"ఆకలేస్తుంది" అన్నాను.

"ఉడ్లాండ్స్ డ్రైవిన్" అంది....

జయ ఇడ్లీని సాంబారులో ముంచుతోంది. చల్లగా వీచే గాలికి, విరబోసిన జుట్టు, ముఖం మీద కెరటాల్లాగా ఆడుతుంది. గుండ్రని ముఖం... చక్కని ముక్కు... చిన్ని పెదాలు...! పెదాలు తెరచి నవ్వినప్పుడు, మెరుపులాగా మెరిసే తీరైన పళ్ళు...

"అలా కొత్తగా చూస్తున్నావేంటి!"...

"నిన్నే"...

"ఏంటి బాబు! ఇంత మందిలో అలా కన్నార్పకుండా చూస్తుంటే... సిగ్గేస్తోంది!" సిగ్గుపడుతూ తలొంచుకుంది. గాలి విసురికి వెంట్రుకలు ముఖం కప్పివేసాయి. తలవంచుకునే మెల్లిగా వెంట్రుకలు సరిచేసుకుంది....

"నిన్ను చూస్తుంటే ఇప్పుడేమనిపిస్తోందో చెప్పనా!"

"ఊఁ"

"గట్టిగా, ఆ ఎర్రని పెదాలు, ఇంకా ఎర్రపడేలా"..... ముద్దు పెట్టుకోవాలనిపిస్తోంది"

"పో రంగా! ఇలాగే మాట్లాడితే నే వెళ్ళిపోతాను".

"వెళ్ళు... నేనూ ఆఫీసుకి వెళతాను"

"కాలేజీ ఎగ్గొట్టింది, నిన్ను ఆఫీసుకి పంపడానికా!"

"నువ్వేగా పొమ్మన్నావ్"....

"పొమ్మనంగానే... వెళ్ళిపోతావా!" అంది రోషంగా...

"నా జయ కోపంలో కూడా అందంగానే ఉంటుంది.." అన్నాను.

జయ బుగ్గలు ఆపిల్ పళ్ళలాగా ఎరుపెక్కాయి. క్రింద పెదిమని పై పళ్ళతో అదిమి పట్టింది....

సప్లయిర్ బిల్లు తెచ్చాడు. బిల్లు పే చేసి బయటకొచ్చాం.

"ఇప్పుడేం చేద్దాం!" అన్నాను.

"బ్లూడైమండ్‌లో కంటిన్యూ షోస్‌గా అక్కడకు పోదాం"

జయ అరచేతిని నా చేతిలో బిగించి రోడ్డు మీద నడుస్తుంటే, ఏదో ఆధిక్యత!

"ఏం ఆలోచించావు రంగా!!"

"దేని గురించి"

"అంత అమాయకంగా అడక్కు"

"నా సమాధానం నీకు తెలియదా జయా"!

"నా కోసం ఈ ఒక్క పనీ చేయలేవా!"

.............................

"నువ్వు తీసుకునే నిర్ణయం మీదే మన పెళ్ళి ఆధారపడి ఉంది!".. అది నీకూ తెలుసు....

..........

"నాన్నకి సినిమావాళ్ళంటే ఎంత అసహ్యమో!... వాళ్ళు చేయి పెడితే గంగాజలంలో కూడా పురుగులు పడతాయంటాడు"

"చాలు"! అని అరిచాను.

జయ కళ్ళెత్తి చూసింది...

"నేను చేసుకోబోయేది, నిన్నా - మీ నాన్ననా!"

"కొంచెం ప్రాక్టికల్‌గా ఆలోచించు రంగా! నువ్వేం చెయ్యమంటే అది చేస్తాను... ఎక్కడికి రమ్మంటే అక్కడకు వస్తాను! కానీ".....

"కానీ"....

"నువ్వు సినిమా ఫీల్డు, మద్రాసు వదిలిపెట్టవు! ఇక్కడ నాన్న సపోర్టు లేకుండా బ్రతకలేం రంగా! కక్ష తీర్చుకోవడానికి నాన్న ఏదైనా చేస్తాడు."

"నన్నేం చేయమంటావ్"

"ప్లీజ్, ఒక్కసారి నన్ను కళ్ళముందు పెట్టుకుని ఆలోచిము."

..................

"నువ్వు గ్రాడ్యుయేట్‌వి! నాన్నతో చెప్పి ఎలాగో మన పెళ్ళికి ఒప్పిస్తాను! నువ్వు అసోసియేట్ డైరెక్టర్ పని మానేస్తే.. నాన్నే ఏదైనా జాబ్ వేయిస్తాడు!... కాదనకు ప్లీజ్..."

...................

"నా డిగ్రీ పూర్తి చేయడానికి ఇంకా ఒన్ అండ్ హాఫ్ ఇయర్ ఉంది. ఈ లోగా ఒక నిర్ణయం తీసుకోవచ్చు!... కానీ"...

...............

"కానీ... ఈ సంవత్సరంన్నర రోజూ నేను టెన్షన్ ఫేస్ చేస్తూనే ఉండాలి! అయినా పరవాలేదు - నీ నిర్ణయం అప్పటికి 'ఫర్'గా ఉంటే చాలు."

'సఫైర్' కాంప్లెక్సు వచ్చింది. రెండు నూన్‌షోలు, కంటిన్యూస్ షో ఆడుతున్నాయి. జనం టిక్కెట్ల కోసం లైన్లో నిలబడున్నారు.

"నేను వెడతాను జయా"

"కోపం వచ్చిందా" అంది భయం భయంగా!

"ఛ. కోపం ఎందుకూ! రాత్రి నీ ఉత్తరం చదవగానే వెంటనే చూడాలనిపించింది! నీ గురించే ఆలోచన!.... చాలా ఆలస్యంగా నిద్రపోయాను. ఉదయం నిన్ను కలవాలని, ఆఫీస్ మాని వచ్చాను.. ఆఫీసులో మా డైరెక్టర్ గారు ఎదురుచూస్తుంటాం! ఈ వారంలో ఊటీ వెళుతున్నాము! ఆ పనులన్నీ ఉన్నాయి." అని అప్పు చెప్పాను.

జయ అలాగే జనంలో నిలబడి ఉంది.

ఆటో కదిలి మిగిలిన వెహికల్స్‌లో కలిసి పోయింది. జెమినీ స్టూడియో దగ్గర ఆటో మలుపు తిరిగింది. డ్రైవిన్ దగ్గర నుండి - జెమిని స్టూడియో వరకూ నిలబెట్టిన బేనర్లు తళుకులతో మెరుస్తున్నాయి! అన్ని బేనర్లలో డైరక్టర్స్ పేర్లు ప్రామ్‌నెంటుగా కనబడుతున్నాయి!... అలాగ నా పేరు ఎప్పుడు పడుతుంది?... పదిమంది నా పిక్చర్ గురించి ఎప్పుడు అనుకుంటారు?....

కాలం పరిష్కారం ఎలా చెబుతుందో?....

✷✷✷

"రంగ బాబు గారూ! ఒకార్టిస్టొచ్చాడు అతనికెలాగైనా, ఏదో ఒక వేషం ఇవ్వాలి!" అన్నాడు ప్రొడక్షన్ మానేజర్.

"ఎందుకనో"...

"నో ఆబ్లిగేషన్ తప్పదు"

"అతని కోసం - మీరింతగా శ్రమపడి పోతున్నారే ... ఏదన్నా ఆమ్యామ్యా...

"ఛ. ఛ... అదేం లేదండీ.... కుర్రాడు బాగున్నాడు కదా అని"...

"తీసుకురండి"

✷✷✷

-తరువాయి భాగం వచ్చే సంచికలో-